తెలుగుకళా సమితి (న్యూజెర్సీ) వారి 1986 మినీ కథల పోటీలో రు.250/-లు బహుమతి పొందిన కథ

# గోడ

## కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు

ఆ గోడ మా తాతలనాటిది. దాన్ని గోడ అనటం కంటే కోట గోడ అనడం సమంజసమేమో! దాని పునాదులు మద్రాసు ఎల్.ఐ.సి. బిల్డింగంత వుండచ్చేమో! నేనెప్పుడూ చూసే ప్రయత్నం చేయలేదు. ప్రహరీ గోడకైనంత ఖర్చు మా యిల్లు కట్టించటానికి కూడా అవలేదంటే అతిశయోక్తి కాదు. మా తాతగారు ముందు ప్రహరీ గోడ కట్టించి ఆ తర్వాత యిల్లు కట్టించాడు. జమిందారీ వంశం కదా! ఆ మాత్రం గోడైనా వుండక పోతే ఎలాని మా తాతగారు అలా చేశారని మా నాయనమ్మ మాకు చెబుతుండేది. అందుకే మా యింటి పేరులోనూ ఆ దర్పం వుంది.

దేశంలో దేనికి లోటున్నా లేకపోయినా పార్టీలకి లోటు లేదుగా! ఎలక్షన్లు వచ్చాయంటే ఇహ మాకు నిద్ర వుండదు. ఎవడు వచ్చి ఎప్పుడు తలుపు తడతాడో ఏ గుర్తుకు ఓటు వేయమంటాడో, వేయనంటే ఏం ప్రాణం మీదకు తెస్తాడోనని మాకు చచ్చేంత భయం. అందరికి 'అలానే' అని సర్ది పంపేస్తాం. గెల్చిన వాడికే ఓటు వేశామని వాళ్లతో వూరేగుతాం. అలా షరో ఐదు సంవత్సరాలు నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చుతాం.

అయితే మా గోడకు మాత్రం ఎప్పుడూ శాంతి వుండదు. అది ఓ తెరచిన దినపత్రిక. దేశం నలుమూలలా జరిగే అల్లర్ల కి అది ప్రతిబింబం. మా గోడ కెక్కగలిగిన న్యూస్ అయిటం ప్రాముఖ్యాన్ని వహిస్తుంది. విద్యార్థుల విప్లవ గీతాలు, పార్టీల కక్షలూ కార్పణ్యాలు బెదిరింపులూ అన్నీ మా గోడ మీద చూడవచ్చు. అన్నిటినీ భరిస్తూ చరిత్రను జీర్ణింప చేసుకుని తరతరాలుగా ఆ గోడ నిలబడి వుంది.

ఈసారి మళ్ళీ ఎలక్షన్లు వచ్చాయి. కొత్త పార్టీలు పుట్టాయి. కుక్క గొడుగుల్లా అంటే కుక్కలకు కోపం రావచ్చు లేదా గొడుగులు సిగ్గుతో ముడుచుకు పోవచ్చు. ఈసారి రాష్ట్ర మంతా వెలిశిన ఓ పార్టీ మా వూళ్లోను మాంచి ముమ్మరంగా ప్రచారం సాగిస్తోంది. యువ కిశోరాలు రంగంలోకి దిగాయి. ఎప్పుడు ఏ అఘాయిత్యం చేస్తారోనని వూళ్లో జనం హడలి చస్తున్నారు.

కొత్తగా అవతరించిన ఆ పార్టీ ఎ.జి.పి. అంటే ఆంధ్రా గొర్రెల పార్టీ. గొర్రె గుర్తు మీదుగా దేశంలో వెలసిన ఏకైక పార్టీ. దానికి చట్టపరంగా యింకా గుర్తింపు లేకపోయినప్పటికి అది రాష్ట్రంలో వున్న అన్ని స్థానాలకు పోటీ చేస్తోంది. రాష్ట్ర జనాభాలో చాలా మందికి ఈ గుర్తు ప్రాతినిధ్యం వహిస్తుందోనని అంచేత తమ పార్టీ తప్పక గెలుస్తుందని అప్పుడే వాళ్లు ప్రచారం ప్రారంభించారు. ఎ.జి.పి.కి. అనుబంధంగా తెలుగు యువ గొర్రెల సేన కూడా ఆవిర్భవించింది. ప్రచారం చేసే బాధ్యత ఈ సేనకే అప్పగించబడింది.

ఆ రోజు ఉదయం నేను మార్నింగ్ వాక్ కని ప్రహరీ గోడ గేటు దాటి బయటకు వచ్చాను. యువసేన లాఠీలతో నా ముందు నిలబడి వుంది. ఓటు అడగటానికి వచ్చారేమోనని అనుకున్నాను. అయినా ఓటు అడగటానికి లాఠీలు ఎందుకు తెస్తారు? అంతకన్నా మించిన పని వుండి వుంటుందని చూస్తూ అలానే నిలబడి పోయాను. నన్ను ఎక్కువ సస్పెన్సులో వుంచటం యిష్టం లేదన్నట్టు ఓ యువకుడు లాఠీని నేలకు తాటిస్తూ అడిగాడు-

''ఏమయ్యా! నీకు బుద్ధుందా?''

నేను ఆలోచన్లో పడ్డాను. ఇంతవరకు ఈ విషయమై నేను ఎన్నడూ ఆలోచించలేదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఎలా సమాధానం చెప్పటం?


మళ్లీ అతడే అన్నాడు-''ఈ గోడ మేము రిజర్వు చేసుకున్నాం గదా! మా అపోజిషన్ పార్టీ వాడి చేత రాయించావేమిటి?''

అప్పుడు చూశాను మా గోడ వంక, తాటికాయంత అక్షరాలు ఉషఃకాంతుల్లో మెరిశి పోతున్నాయి. ఓ 'జలగ' గుర్తు రంగుల్లో వుంది. అప్పుడు నాకు అర్థమయింది. దేశ వ్యాప్తంగా గుర్తింపున్న పార్టీ వాళ్ళు గతరాత్రి మా గోడ మీద తమ ప్రచారానికి సంబంధించిన రాతలు రాశారని. ''నీకు కళ్లు లేవా? గోడకు ఓ మూల 'ఆర్' అని రాశి దాని క్రింద ఎ.జి.పి. అని రాశాం. నువ్వు ఆ జలగ పార్టీ వాళ్లకు గోడ ఎందుకిచ్చావు? అంటూ ఆ కుర్రాళ్లు నన్ను గదమాయించారు.

''బాబూ! మీరు మా గోడను రిజర్వు చేసుకున్నట్టు నాకు తెలియదు. వాళ్ల ఆ రాతలు రాశినట్టూ తెలియదు. మీరు నన్ను అడిగి రిజర్వు చేసుకోనట్టు వాళ్లు నన్ను అడిగి రాయలేదు. రాజ్యమేలే పార్టీ ప్రతినిధులు మీరు. మమ్మల్ని ఎందుకు అదుగుతారు? ఇవన్నీ ఎప్పుడో జాతీయం చేయబడ్డాయి'' ధైర్యం చేసి మనస్సులోని మాట అన్నాను.

''అయితే నీకు తెలియదంటావు. ఇదంతా ఆ అప్పోజిషను గాళ్లు చేసిందేనంటావు. సరే! ఆళ్ల సంగతి మేం చూసుకుంటాం. నువ్వెళ్లు'' అంటూ నన్ను క్షమించి అప్పటికి వదిలి పెట్టారు.

తీరా నేను తిరిగివచ్చే వేళకు మా యింటి ముందు పెద్ద తిరునాళ్లలా వుంది. జలగ పార్టీ



వాళ్ళూ, యువ సేవా లాఠీలు పట్టుకొని ఎదరా బదరా నిలబడి బండబూతులు తిట్టుకుంటు న్నారు. ఆ రభస చూస్తే నాకు కాళ్ళూ చేతులూ ఆడటం లేదు. ఒకరి అంతు మరొకరు చూస్తాం అంటూ బెదిరించుకుంటున్నారు.

"రేపు తెల్లవారేలోగా మీరు రాసినవి చెరిపి క్షేమంగా వుంచుతారా సరి! లేకుంటే రక్తం ప్రవహిస్తుంది" అంటూ యువసేన జలగ పార్టీ వాళ్లని బెదిరించింది. "గోడ నీ యబ్బ సొమ్ము కాదు రిజర్వు చేసుకోవటానికి. ఎవడు ముందు రాసుకుంటే వాడిదే! ఈ రాతల్ని చెరపటం ఆ బ్రహ్మతరం కూడా కాదు. దమ్ముంటే రేపు యింకా యింత జనాన్ని తెచ్చుకో! తేల్చు కుందాం" అంటూ జలగ పార్టీ వాళ్లు ప్రతిఘ టించారు.

కొంచెం సేపు యిలానే వాదులాడుకొని రక్తపాతాన్ని రేపటికి వాయిదా వేసి బలాన్ని పెంచుకునేందుకు ఆ నాటికి యుద్ధ విరమణ చేశారు. నాకు ఏమి చెయ్యాలో పాలు పోవటం లేదు.

తెల్లవారక ముందే మళ్లీ యిరు పక్షాల వాళ్లు వచ్చారు. ఈ సారి జనం మరింత వున్నారు. కానీ అందరు నిశ్శబ్దంగా నిశ్చేష్టులై వున్నారు. నిద్రపోతున్న నన్ను తలుపు తట్టి మరీ లేపారు. వాళ్లు కోరస్‌గా అడిగిన ఒకే ఒక ప్రశ్న "గోడ ఏమైందీ?" అని

నేను క్షణం సేపు మౌనంగా వుండి పోయాను.

"చూడండి బాబూ! ఇది మా తాతగారు కట్టించిన గోడ. దీని మీద నాకు సర్వ హక్కులు వున్నాయంటే మీరు నమ్మాలి. లేదంటే ఆయన వీలునామా మీకు చూపిస్తా. నాకు తెలిసినంత వరకు ఇది మా భద్రత కోసం కట్టించింది. కానీ యిప్పుడు ఈ గోడ శాంతి భద్రతలకే ముప్పు తెచ్చేట్టు వుంది. అందుకే ఖర్చుకు కూడా వెరువ కుండా నేనే ఈ గోడ పడ గొట్టించా! తప్పయితే నన్ను క్షమించండి.

మరో విషయం. మీలో ఎవరికైనా ఈ గోడ చాలా అవసరం అనిపిస్తే మరల దీన్ని కట్టించ వచ్చు. నాకేమి అభ్యంతరం లేదు. కానీ మీ రెవ్వరూ అలా చెయ్యరని నా నమ్మకం. ఎంచేత నంటే పోయిన ఎలక్షన్లకు రాసిన రాతలు సంవ త్సరం గడిచినా మీరు చెరపలేదు కాబట్టి. పండక్కి మేం సున్నాలు కొట్టించేంత వరకు అవి అలానే వున్నాయి. మరోసారి వేడుకుంటు న్నాను. మా గోడ కారణంగా యిక్కడ రక్త పాతం జరక్కూడదు."

అందరూ ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. ఏమనుకున్నారో ఏమో ఎక్కడ వాళ్లు అక్కడకు వెళ్లిపోయారు. నాకు మాత్రం గోడ వుండటం కంటే లేకుంటేనే రక్షణ ఎక్కువగా వుందనిపించింది.

●